


# కైకాదేవి నాలుగో కోరిక

యండమూరి వీరేంద్రనాథ్.

పునర్ముద్రణ

**తొలి ఇతిహాసానికి శ్రీకర హాసమై, అలసిన వాల్మీకి మలి ముగింపు దరహాసమై ఒక మహాకావ్యం కొలిక్కి వచ్చింది.**

–1 –

**పట్టభిషేకానంతరం** పందిరి మంచంపై నిద్రిస్తోన్న రాముణ్ణి చూస్తోంది సీత.

"...దొప్పలు మూసిన కలువల నొప్పగు రెప్పల చందము చూడనా? గప్పున గుప్పిలి విరిగిన అప్పటి శివుని విల్లు గురుతుకు వచ్చి ఇప్పతి ఇప్పటి నిదురన పెదవుల విచ్చిన నవ్వు చూడనా? నన్ను హరించినవాని సంహరించినప్పటి పెదవుల బిగపట్టు చూడనా? అందము పందెము వేసి ఓడిన చంద్రుని కప్పము పొందిన రామచంద్రుని చందము చూడనా?" అనుకున్నది.

అటు యుద్ధం అలసట. ఇటు పట్టాభిషేకం అలసట. మూడు విధముల అలసిన రాముడు నిద్రిస్తున్నాడు. అశోకవనంలో తనకు అలసట ఏమున్నది?

ఆంజనేయుడు వచ్చినప్పటి నుంచీ మరింత నిశ్చింత. తాను పెట్టిన గడువు లోపలే రాముడు వస్తాడని తెలుసు. తనను రక్షిస్తాడనీ తెలుసు. ఇక అలసట ఏమున్నది? కబుర్లు చెప్పటానికి త్రిజట ఉన్నది.

త్రిజట గుర్తు రాగానే ఆ రోజు ఆమె ప్రశ్న గుర్తు వచ్చింది.

"నాకో సందేహం. అడగనా?" అన్నది ఆ రాక్షసి.

"అడుగు".

"ఎండ కన్నెరుగని సుకుమారివి కదా. పాదరక్షలు కూడా లేకుండా ఆ అడవిలో అన్నన్ని క్రోసులు ఎలా నడిచావు?"

సీత సిగ్గుతో తల దించుకుంది. అందులో అంత సిగ్గుపడాల్సిన విషయం ఏమున్నదో ఆ రాక్షసికి అర్థం కాలేదు. ప్రశ్న మరింత రెట్టించింది. అయినా చెప్పలేదు.

"నాకు తెలుసులే" అన్నది త్రిజట. తన మనసులో మాట ఆమెకెలా తెలిసిందో తెలియక ఆశ్చర్యంతో తలెత్తి, "నీకేమి తెలుసు?" అని అడిగింది సీత.

"కూతురు కష్టపడుతూంటే ఏ తల్లి చూస్తూ ఊరుకుంటుంది? కాలికి ముళ్ళు గుచ్చుకోకుండా పచ్చిక తివాచీ పరచదూ?" అన్నది ఆ శుక్రశిష్యాగ్రణి.

సీత అబ్బుర పడింది. ఆమెకు అసలు ఆ ఆలోచనే రాలేదు. కానీ అది నిజమే. అడవిలో గ్రీష్మ, హేమంతాల ఉధృతం కాస్త తగ్గించమని ఇంద్రుని కోరింది విశ్వంభర. కాశ్యపి మాట కాదనే ధైర్యం ఇంద్రునికి ఎక్కడిది? కాసింత చూసీ చూడనట్టూ ఉండమని కాలధర్మానికి చెప్పాడు. దాంతో కాలం ఆగింది.

ఋతువులు ధర్మం తప్పాయని ఋషులు కంగారు పడి దివ్యదృష్టితో చూస్తే ఏమున్నది? అట జని ఆమని ఆ వని అవనిజని కని, తన పని మానుకుని, అక్కడే ఆగి పోయిందంట. అలా జరిగిందో లేదో తనకు తెలియదు కానీ, అసలు కారణం అది కాదు. ముందు నడుస్తున్న మొగుణ్ణి మరీ మరీ చూడాలనిపిస్తోంది. వెనుక మరిది ఉన్నాడాయే. తలెత్తి చూస్తే బాగోదు కదా. మోము దించుకుని నీల మేఘశ్యాముని నీడని చూస్తూ అడుగులు వేస్తోంది. నిజం చెప్పొద్దూ. మలిసంజె వెలుగులో, ఆరింజ రంగులో, విరజాజి నవ్వుతో, కదిలే వింజెలా రాముడు నడుస్తోంటే… నెమళ్ళూ, లేళ్ళూ, చివరకి సెలయేళ్ళూ కూడా ఆగి ఆగి ఆ ఆ సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నాయి. రాముని నీడ సైతం కాముని బాణంలా ఉన్నది. నడిచే దారిలో పచ్చిక మాత్రం ప్రేమలో పడక ఛస్తుందా? ఆపాదస్పర్శకి అలజడి ఆపాదమస్తకం ఆపాదనము కాగా, ఆ మేఘశ్యాముని నీడ తమను వీడి పోతోంటే, రాత్రి మంచుకి వాటి అంచులపై నిలచిన హిమ బిందువులు చెంప అంచున జారిన నీటి చుక్కల్లా ఉన్నాయి.

… ఇలా ఆలోచిస్తూ అడవిలో నడుస్తోంటే ఇక అలుపేమి వస్తుంది? కానీ వయసులో పెద్దామె ఆ త్రిజటకి ఇవన్నీ ఏమి చెపుతుంది? 'నీడను ప్రేమించటం ఏమిటమ్మా' అని నోరు నొక్కుకోవటం తప్ప చెప్పినా అర్థమవుతుందా ఏమి? అందుకే నవ్వి ఊరుకుంది.

…

యుద్ధమున అలసిన శృంగార ధనుష్మంతుడు ఒద్దికగా నిద్రిస్తున్నాడు. తనకే నిద్ర పట్టటం లేదు. పద్నాలుగేళ్ళ తరువాత పందిరి మంచం పై పడక కొత్తగా ఉన్నది. వివాహం జరిగి అప్పుడే ఇన్నేళ్ళయిందా? కాలం ఎంత తొందరగా నడుస్తోంది..!

వివాహం తలపుకు రాగానే స్వయంవర ఘటన గుర్తు వచ్చింది. స్వయంవరమని తెలియగానే కంగారుపడి తల్లి వద్దకు పరిగెత్తుకు వెళ్లి అర్థం అడిగింది.కూతురి అమాయకత్వానికి నవ్వుకున్న ఆ జనక రాజపత్ని "నీకు నచ్చిన వాడి మెడలో హారం వేయటమమ్మా" అని చెప్పింది.

ఆ మాత్రం తెలియక కాదు తను అడిగింది. 'స్వయం' అంటే తనకి. 'వరం' అంటే ఎన్నుకునే వెసులుబాటు..! అంతే కదా. కూతురు చిత్తరువుతో పాటు, ఆ బాలిక గుణగణ విశేషాలను, వివిధ కళారంగ ప్రవేశ పాండిత్యాలనూ ఉటంకిస్తూ, అన్ని దేశాదిపతులకూ వార్త పంపిస్తాడు వధువు తండ్రి. తనను మెచ్చి వచ్చిన వారిలో తనకు నచ్చినవాడి మెడలో దండ వెయ్యటమే కదా స్వయంవరం అంటే..! కానీ ఇక్కడ పరిస్థితి అది కాదే. ధనుసు ఎత్తిన వాడికి మనసు ఇవ్వాలట. ఏ తలలో బుద్ధి లేనివాడో, పది తలల వాడో వచ్చి విల్లు ఎత్తేస్తే వాడిని చేసుకోవాల్సిందేనా? తనకి కూడా ఒక ఇష్టం అంటూ ఉంటుందని తండ్రి భావించలేదా? 'అమ్మా. నేను చేసుకోవాల్సింది నేను నచ్చిన వాడినా? నాకు నచ్చినవాడినా?' అని అడిగింది. కూతురి తర్కానికి కంగారు పడిన తల్లి "నిన్ను చేసుకునేవాడు నీకన్నా పరాక్రమవంతుడై ఉండాలని మీ తండ్రిగారి ఉద్దేశమమ్మా. తండ్రికి మించిన శ్రేయోభిలాషి మరెవరు ఉంటారు జనకపుత్రీ?" అని సర్ది చెప్పింది.

స్వయంవర సమయం ఆసన్నమయింది. విల్లు మాట దేవుడెరుగు. నారి మీట రానివారు నారి చేపట్ట వచ్చినారు. మనసున చింతన, చెలికత్తెల చెంతన నిలబడి క్రింద రారాజుల భంగపాటు చూస్తోంది. ఎత్తక నేల పడిన వాడు, ఎద పగిలిన వాడు వస్తున్నారు. వెళ్తున్నారు.

మేడ అంచున పాదము, మెడ అంచున స్వేదము. సీత మనసు ఉత్కంటము. అప్పుడు వచ్చాడు రాముడు. నూనుగు మీసమ్ములవాడు, నూగు నవ్వులవాడు, నూబూవు నాసిక వాడు. నూవు దళపత్ర నాజూకు రేడు.

విల్లు వైపు అరలిప్త, ఆమె వైపు ఆరు లిప్తల కాలం చూసి, వంగి విల్లు అందుకున్నాడు. ఫెళ్ళుమంది విల్లు. ఝల్లుమంది వళ్ళు.

భూమిపుత్రి రామపత్ని అయ్యాక "ఎప్పటి నుంచో నాకో సందేహం" అని అడిగింది. అడగమన్నాడు జగదభి రాముడు.

"ధనువు ఎత్తే ముందు నా జడ వైపు తదేకంగా ఎందుకు అంతసేపు చూశారు?"

రాముడు నవ్వి ఊరుకున్నాడు. ఆమెకు ఉక్రోషం వచ్చింది. "ముందున్న అన్నులమిన్న కందళి కన్నుల కన్నా, కన్నాకు నాజూకు చెంపల కన్నా, కన్నువిలుకాని చాపాకృతి కన్బొమ్మ కన్నా, వెన్ను వెనుకున్న వేణి మిన్ననా?" అని అడిగింది.

"అన్ని అనుమానాలు వద్దే సుగంధ కుంతలా" అన్నాడు.

ఎన్నిసార్లు అడిగినా ఆ ప్రశ్నకి అతడు సమాధానం చెప్పక పోయేసరికి ఆ ఘన చంచరీక చికుర దీర్ఘ వినీల వేణి సందేహం అలాగే ఉండిపోయింది. ఈ వంశీకులంతా ఇంతే అనుకుంది.

చివరికి ఆ వశిష్ఠుల వారు కూడా అంతే. పెళ్లయిన కొత్తలో భర్త బాల్యం గురించి అత్త కౌసల్య ఎన్నో కబుర్లు చెప్పేది.

“మీ ఆయన బొడ్డు కోస్తున్నప్పుడు బ్రహ్మ కంగారు పడ్డాడటమ్మా” అన్నది ఒక రోజు.

తను ఉత్సుకంగా “ఎందుకు?” అని అడిగితే, “...ఏమోనమ్మా. నాకు తెలీదు. అదేదో బ్రహ్మ రహస్యమట. వశిష్ఠుల చెప్పారు” అని మాట దాటేసింది.

– 2 –

**పట్టాభిషేకం** హడావుడితో అలసి పడుకున్న రాముణ్ణి చూస్తోంది సీత. పట్టాభిషేకం గుర్తుకు రాగానే దాని ముందు రోజు గుర్తొచ్చింది.

“మనము ఒక చోటుకు వెళ్ళాలి” అన్నాడు రాముడు.

“ఎక్కడికి” అన్నది సీత.

నవ్వాడు జగదభిరాముడు. “పద్నాలుగు సంవత్సరాల క్రితం ‘...వెళ్ళాలి’ అన్నప్పుడు ఎక్కడికని అడగకుండా అనుసరించావు. ఇప్పుడు కాబోయే రాణివి కదా. సందేహించటంలో తప్పు లేదులే” అని ఆట పట్టించి బయల్దేర తీశాడు.

‘ఎక్కడికన్న’ ఆమె సందేహం సరయూ నది ఒడ్డుకి వెళ్ళే వరకూ అలాగే ఉండియింది. పడవలో వెల్లకిలా పడుకొని ఆకాశం కేసి చూస్తూ ఉన్నాడు గుహుడు. సీతారాములని చూసి తత్తరపాటుతో లేచాడు.

జీవితంలో ఎన్నో మధుర, కఠిన అనుభవాలకి పునాది వేసిన ఆ పడవని ఆప్యాయంగా చూసింది సీత.

నావ అంచుపై గుహుని పక్కనే కూర్చుని ఆ చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు రాముడు. “వెళ్ళేటప్పుడు నీ పడవలో వెళ్ళాను. వచ్చేటప్పుడు అదే దారిన రాలేక పోయాను. నన్ను క్షమించు. రేపు నా పట్టాభిషేకం. భార్యా సమేతంగా రమ్మని నిన్ను అభ్యర్థించటానికి వచ్చాను” అన్నాడు.

గుహుడి కంట చప్పున నీళ్ళు చిప్పిల్లాయి. గద్గద స్వరంతో “రామా... రఘుకుల సోమా.. ఘన శుభద జన కరుణ సుధాపూర పారావారా... నన్ను గుర్తుపెట్టుకుని మళ్లీ నీవు ఇక్కడికి రావడమే చాలు. నీవు నాకు క్షమాపణ చెప్పటమా..! రామయ్య తండ్రీ..! ఆజ్ఞాపించవలసిన వాడివే కానీ అభ్యర్థించేవాడివి కాదు కదా” అంటూ వంగి కాళ్ళు పట్టుకోబోగా, రాముడు అతడిని ఎత్తి పట్టుకున్నాడు.

ఆ దృశ్యాన్ని చూస్తున్న సీత మనసంతా ఉద్వేగంతో నిండిపోయింది.

ఆ మరుసటి రోజు పట్టాభిషేకం వివాహం కన్నా వేయి రెట్లు వైభవంగా జరిగింది.

వివాహం గుర్తు రాగానే, సీత ఆలోచనలు వివాహానికి కొన్ని రోజుల ముందు జరిగిన సంఘటన వైపు సాగాయి. మరో నాలుగు రోజుల్లో వివాహం అనగా పూదోట పక్కన నిలబడి ముగ్గురు చెలికత్తెలు మాట్లాడుకోవటం విన్నది.

“మన రాకుమార్తె చిటికెన వేలితో ఎత్తిన ధనుస్సు లేపటానికి, పాపం ఆ పెళ్ళికొడుకు చాలా కష్టపడ్డాడట” అన్నదొక వాచాల వధూటి.

నికృష్టమైన అభిప్రాయాలకేముంది? మాటల రూపంలో అవి వికృతాకృతి దాల్చుకుంటాయి. ఎదన అనుమానాన్ని చిలుకుతాయి.

“మరొకరు ఎత్తటానికి వీల్లేకుండా విరిచేశాడట” అన్నదొక వదంతి వ్యాప్త కుతూహలాభిలాష కబుర్ల కాణాచి.

“అవునే. యుద్ధం చెయ్యటానికి ధైర్యం కావాలి కానీ, లేపటానికేముందే. కాస్త బలం ఉంటే చాలు...” అన్నది మరొక ప్రవాద ప్రమోదిని.

వైదేహి మనసు పరిపరివిధాల పోయింది. ‘తన భర్త బరువుల నెత్తేవాడా? బరిలో ప్రత్యర్థిని గాలిలో లేపే మల్ల యుద్ధ నిపుణుడా? అనిలో అరి వక్ష విచ్ఛేదనా దక్షుడు కాదా?’ అని కలత పడింది.

అయితే ఆమె అనుమానం తొందరలోనే తీరిపోయింది. సీతారామలక్ష్మణులు అరణ్యవాసంలో ఉండగా ఒక రోజు మధ్యాహ్నం ఉన్నట్టుండి ఆకాశమంతా దట్టమైన చీకటి కమ్ముకుంది.పర్ణశాల నుంచి వారు విస్మయంతో బయటకు వచ్చి చూస్తే ఏముంది? బాడబానల భయద నిర్ఘాత ప్రళయకాల దుర్భర తిమిరాన్ని తలపిస్తూ, పద్నాలుగు వేల మంది భయంకరాకారులైన రాక్షసులు అంబరాన్ని కారుమబ్బు కమ్మినట్టు వస్తున్నారు.

ఎవరు వారు? ఖరుని అనుచరులు. ఖరుడు శూర్పణఖ సోదరుడు. దండకారణ్యంలో రావణుడి ప్రతినిధి. తనకు లక్ష్మణుడు చేసిన పరాభవం గురించి ఆమె ముందుగా రావణుడికి చెప్పుకోలేదు. వెళ్లి ఖరునికి చెప్పుకుంది. ఆ అసురాగ్రేసరుడు ఆగ్రహావేశాలతో ఊగిపోయి, రాముడిని సంహరించటానికి సర్వసైన్యాన్నీ సమీకరించుకుని వస్తున్నాడు.

ఆంబోతుల గుంపులా వస్తూన్న ఆ అసురులతో ఆకాశం నల్లబడింది. అడవి కంపించింది. భూమ్యాకాశాలు దుమ్మూ, ధూళితో నిండి పోయాయి.

భార్యను దూరంగా తీసుకువెళ్ళమని తమ్ముడిని నిర్దేశించి, విల్లు అందుకున్నాడు రాముడు. లక్ష్మణుడు సీతని ఒక గుహలోకి తీసుకువెళ్ళాడు.

బండల చాటు నుంచి బయట దృశ్యం చూసి, స్వతహాగా ధైర్యస్తురాలైన సీత కూడా కంపించింది.

శూలాలూ, గదలు, కత్తులూ, కటార్లు, పదునెక్కిన గండ్రగొడ్డళ్ళు, పెకిలించిన మహావృక్షాలూ పట్టుకుని అంచులు కనపడని ఉప్పెనలా వస్తూన్నది రాక్షసమూక.

వారికి ఎదురుగా నిలిచాడు రాముడు. అతడిప్పుడు నీలద్యుతి సౌమ్యాకారుడు కాడు. జన రక్షక దీక్షిత రణాధ్వర బృంద దివ్యాస్త్ర పరివేష్టితుడు. ధనుస్సు నేలకానించి నారి మీటాడు. ఆ ఓంకార ధనుష్టంకారం దిగంతర, గుహాంతర, అమరధామాంతర, నాగలోక సాగరాంతర, హిమశిఖరాగ్ర శైలాంతరాన్ని తాకింది. ఆ మౌర్వీరవం విని భూమిపుత్రి వణికింది. గతంలో లక్ష్మణుడు ఒకసారి విన్నాడు. ఎప్పుడు? తాటకిని చంపినప్పుడు.

‘ఆ ముని జన రక్షకుని వింటి నాదం విన్నావా వదినా? మా అన్నయ్య విల్లు శబ్దం విన్నావా’ అన్నట్టు చూసాడు లక్ష్మణుడు. ఆమె దృష్టి అటు లేదు. కళ్ళు విస్ఫారితం చేసుకుని భర్తనే చూస్తోంది.

శివధనుర్భంగ సమయంలో అబ్బురంతో చూసి ఉండవచ్చు. వరమాలాంకృత సమయంలో సిగ్గుతో చూసి ఉండొచ్చు. తలంబ్రాల సమయంలో తత్తరబాటుతో చూసి ఉండవచ్చు. సరిగ్గా చూసిందెక్కడ? కన్నార్పకుండా చూడటం అదే తొలిసారి.

అప్పటి వరకూ ఆమెకి రాముని లేత చెంపల పై పూత లావణ్యం మాత్రమే తెలుసు. మరి ఇప్పుడు? ధగద్ధగద్ధగ రుధిర ప్రభ వర్ణ నయనాలతో, అరి విభ్ర ప్రకాశ కాంతులతో అరివీర భయంకరుడై నిలబడి ఉన్నాడు. ఎప్పుడు తీస్తున్నాడో తెలియదు. ఎప్పుడు విడుస్తున్నా తెలియదు. కన్నుకందని వేగంతో విల్లు వెన్ను లాగి బాణాల్ని వదుల్తున్నాడు.

జెండాలు విరిగి; గుర్రాలు కూలి, మొండాలు సోలి, తెగి పడిన శవాల గుట్టలు ఆ యుద్ధక్షేత్రాన్ని నింపివేశాయి. పద్నాలుగు వేలమందిలో ఏ ఒక్కడూ ప్రాణాలతో మిగిలి లేడు.

(చాటుగా ఈ యుద్ధాన్ని చూసిన అకంపనుడు పరుగు పరుగున రావణుడి దగ్గరకు వెళ్లాడు. ‘యుద్ధంలో రాముడిని ఎదుర్కోలేవు. దొంగగా వెళ్లి సీతని అపహరించు. రాముడు ఆత్మహత్య చేసుకుంటాడు’ అని మామయ్యకి ఇచ్చాడు. రావణుడి దొంగచాటుగా వచ్చింది అందుకే).

సీత చూసిన తొలి యుద్ధం అది. రాక్షస సంహారం అయ్యాక రాముడు సీతతో “నీ పనుల వలన నీకు హాని జరిగితే అది నీ ‘బలహీనత’…! నీ పనుల వలన మరొకరికి హాని కలిగితే అది ‘తప్పు’….! కామము శూర్పణఖ బలహీనత. అకారణ యుద్ధము ఖరుని తప్పు. రెండూ నాశనకారులే” అన్నాడు.

“మన పని వల్ల మనకి గానీ, మరెవరికీ గానీ హాని కలగకపోతే అది తప్పు కాదా?” అని అడిగింది.

“కాదు. అది కేవలం పొరపాటు. లేదా అమాయకత్వం. అజ్ఞానం. తెలియకుండా ఎవరికీ ‘హానికారిణి కాని’ పని చేసినప్పుడు “అహం కస్యచిత్ హాని న కృతవాన్. ఏతత్ నామ్ పాపం నాస్తి” అనుకుంటే సరి. నా తప్పు వల్ల నాకు గానీ, మరెవరికీ నష్టం లేదు కాబట్టి నాకు పాపం రాదని దాని అర్థం” అన్నాడు.

ఏడాది తరువాత తాను అలా అనుకోవలసి వస్తుందని ఆమె అనుకోలేదు.

– 3 –

**భూమిని** వెన్నెల అభిషిక్తం చేస్తోంది గానీ, కంటిని నిద్ర అభిషేకం చేయటం లేదు. అలసిన రాముడింకా నిద్రలోనే ఉన్నాడు. ఇటు నుంచి అటు వత్తిగిల్లింది.

ఆమెకు కాసింత గర్వంగా ఉన్నది. రాముడు ఏ యుద్ధంలో అలసినాడు? ఆనాటి ఇరువది చేతుల వాడిని విగతుడిని చేయటంలోనా?ఈ నాటి పట్టాభిషేకపు బడలికతోనా? లేక ‘అస్త్రంతో అసురుడిని చంపటం కాదు. విల్లులా వంగిన నన్ను సంధించి గెలువ’మన్న నడుము గర్వాన్ని అణచటానికి చేసిన యుద్ధంలోనా?

శతాధిక పున్నముల తరువాత తెగిన ఆనకట్ట, గుబ్బి గుబ్బల రేదునే అబ్బుర పరిచింది. సంతుష్టడైన చిలుక తత్తడిరౌతు సంతసించి తనువు వీడి శలవు కోరిన ఫలితమే పతి గాఢ నిద్ర.

ఆలోచిస్తూ ఆమె అటు వత్తిగిలింది. నిద్ర గుర్తు రాగానే మరిది భార్య, ఆపై మరో మరిదీ గుర్తొచ్చారు. వనవాస ఆశ్రమంలో ఉండగా వచ్చాడు భరతుడు. వెనుకనే ప్రవాహంలా జనం. తండ్రి మరణ వార్త విని తన భర్త పొర్లిపొర్లి ఏడవటం చూసి, 'మనిషికి మరణం సహజమన్నది వేదాంత విశేషమా? భవబంధంతో దుఃఖించటం మానవ సహజమా?' అనుకుంది.

ఆ తరువాత అన్నాదమ్ముల మధ్య రాజ్య స్వీకరణ గురించిన సంభాషణ జరిగింది. "అగ్రజుడు జీవించి ఉండగా అనుజుడు రాజ్యపాలన చేయటం తప్పు. బలహీన క్షణంలోనాన్న ఇచ్చిన వరం నాకు శాపమయింది. భారమయింది. నన్ను విముక్తుడిని చెయ్యి" అన్నాడు భరతుడు. అప్పుడు తన భర్త చెప్పిన మాటలు సజీవంగా గుర్తున్నాయి. అప్పటికామెకు దశరధుడి గురించి పూర్తిగా తెలీదు.

"నాన్నగారి గురించి ఏమనుకుంటున్నావు భరతా? నీకు అసలు మన తండ్రిగారి గురించి తెలుసా? శని ప్రభావం వల్ల ఒకప్పుడు అయోధ్య మొత్తం దుర్భిక్షమైపోయింది. నాన్న వెళ్లి శనితో యుద్ధం చేశారు. శని బలం ముందు ఆయన శక్తి సరిపోలేదు. సైన్యమంతా నిర్వీర్యమైంది. మన తండ్రి కేవలం పది రథాలతో మిగిలారు. అయినా ఆయన యుద్ధం ఆపలేదు. శని ఆయన పట్టుదలకి మెచ్చి, మన రాజ్యాన్ని సుభిక్షం చేశాడు. పది రథాలతో మిగిలినవాడు కాబట్టే ఆయనకి 'దశరథుడు' అన్న పేరు వచ్చింది. అంత గొప్పవాడు మాట వరసకి మూడు వరాలు ఇవ్వడు. ఇస్తే, బెంగతో ప్రాణాలయినా కోల్పోతాడు గానీ మాట తప్పడు. అలాంటి మనిషికి కొడుకుని అయిన నేను, మాట జవదాటితే నా అంత దౌర్భాగ్యుడు మరెవ్వరూ ఉండరు" అన్నాడు రాముడు.

ఆలోచనకి ఆనకట్ట ఏమున్నది? లంకలో త్రిజట నుంచి మొదలైన ఆలోచన... మిథిలా నగరం స్వయంవరం మీదుగా, అయోధ్య అరణ్యవాసం, దండకారణ్య యుద్ధం, సరయూ నది ఆహ్వానం దాటి పుష్పక విమానం వైపు మళ్ళింది.

రావణుడు చావగానే విభీషణుడి పట్టాభిషేకం పూర్తి చేసి పుష్పక విమానం ఎక్కారు. మణులతోను, వజ్రములతోను, మేలిమి బంగారపు కిటికీలతోనూ శోభాయమానంగా ఉన్నది అది. అన్నదమ్ములు యోగముద్రలో కనులు మూసుకొని ఉన్నారు. వాచాలులైన వానరులందరూ నిద్రావస్థలో ఉండటంతో విమానం నిశ్శబ్దంగా వెళ్తోంది. నగలు విసిరిన స్థలము, జటాయువు పోరాడిన ప్రదేశము కనబడతాయేమో అని మేఘాల మధ్య నుంచి క్రిందికి చూస్తోంది సీత. ఆమె మెలకువగా ఉన్నట్టు గమనించిన హనుమంతుడు నాలుగు మంచి మాటలు చెప్పి ఆమెను సంతోష పరుద్దామని వచ్చి పాదాల చెంత కూర్చున్నాడు. ఆమె అతని వైపు ఆప్యాయంగా చూసింది.

"సీతమ్మ తల్లీ. రామ రావణ యుద్ధ సమయంలో కిష్కిందలో ఏం జరిగిందో తెలుసా?" అంటూ చెప్పటం ప్రారంభించాడు.

...

మరుసటి రోజు యుద్ధానికి ఆయుత్తం అవుతున్నారు అందరూ. రాముడు ఒంటరిగా ఉండటం గమనించి, ఇద్దరు వానరులు ఏదో అడగాలన్న తపనతో, జంకుతో దూరంగా నిలబడి ఉండటం చూసి దగ్గరకు పిలిచాడు.

"ఏమిటి అలా నిలబడ్డారు? రండి. చెప్పండి" అన్నాడు.

"అవి విన్న తర్వాత ఒకే బాణంతో మా ఇద్దరినీ చంపేస్తారు స్వామీ" అన్నాడు అందులో ఒకరు. మేఘవర్ణుడు ప్రేమను వర్షించే స్వరంతో "అటువంటిదేమీ జరగదని హామీ ఇస్తున్నాను. అడగండి" అన్నాడు

ఒకడు ధైర్యం తెచ్చుకుని "కనబడకుండా పోయిన భార్య నీది. అయోధ్య నుంచి నీ సైన్యాన్ని తెప్పించుకోకుండా మమ్మల్ని సమిధలుగా వాడుకోవటం సమంజసమేనా? అన్నని చంపి భార్యని తనకిచ్చావని, నీ భార్య కోసం మమ్మల్ని చావమంటున్నాడు మా రాజు. ఇది సరి అయినదేనా?" అని అడిగాడు.

దానికి రాముడు ఈ విధంగా అన్నాడు. "నా భార్య సీత కొద్ది రోజుల గడువు మాత్రమే పెట్టి ఆత్మాహుతి చేసుకుంటానన్నది. అయోధ్య సైన్యం ఈ లోపల రాలేదు. అంతకన్నా ముఖ్యమైనది కారణం అన్నీ వదులుకుని అరణ్యానికి వచ్చినవాడు అవసరం పడినప్పుడు అక్కడి సైన్యాన్ని ఆశించటం అనుచితం. ఇక సుగ్రీవుడి సాయమంటావా? ఒక రాజుకి మరొక బలమైన రాజుతో స్నేహం ఉంటే, పక్క రాజుల దండయాత్ర భయం లేకుండా తన పాలన పైననే దృష్టి నిలపవచ్చు. అది రాజ ధర్మ సూక్ష్మం. అందువల్ల అతడు సీతాన్వేషణలో నాకు సహాయపడ్డాడు. ఇక నీ భయం సంగతంటావా? తన ప్రజలని రక్షించటం కోసం రాజు సైన్యాన్ని పోషిస్తాడు. తర్కం ఆలోచించకుండా రాజు చెప్పింది ఆచరించటమే సైనికుని బాధ్యత.యుద్ధంలో సమిధనవుతానేమో అన్న భయమున్నవాడు సైనికుడు కాలేడు" అని ఆగి, "నీ అనుమానం నివృత్తి అయిందా?" అని అడిగాడు.

అతడు తల ఊపి నమస్కరించాడు.

రెండో వానరుని వైపు తిరిగి "నీ సందేహం ఏమిటి?" అన్నాడు రాముడు.

"అది విని నన్ను వధిస్తారు".

"ముందరి కాళ్ళకు బంధం వేస్తున్నావా. లేదు. నిర్భయంగా అడుగు" అదే చిరునవ్వుతో అన్నాడు దయాజలధి దాశరధి.

"నిన్న యుద్ధంలో నీ తమ్ముడు మరణానికి చేరువైనప్పుడు *'...దేశే దేశే కళత్రాణి! తం తూ దేశ న పశ్యామి యత్ర భ్రాత్ర సహోదర....* భార్య ఏ దేశంలోనైనా లభిస్తుంది. తోబుట్టువులైన సోదరులు దొరుకుతారా?' అని నీవే రోదించావు. సీతాన్వేషణకి ముందు, ఎక్కడ ఉన్నదో తెలియని, అసలు ఉన్నదో లేదో నీ భార్య కోసం అంతగా వెతకవలసిన అవసరం

ఉండినదా? ఆమె సౌందర్యవతే కావచ్చు. కానీ అలాంటి స్త్రీలు నీకు అయోధ్యలోనే చాలామంది దొరుకుతారు. మీ వంశంలో బహు భార్యలను చేసుకోవడం ధర్మమే. మీ పెద్దల సంగతి నాకు తెలియదు కానీ మీ తండ్రి ముగ్గుర్ని చేసుకున్నాడు కదా. అరణ్యవాసం ముగిసే సమయం కూడా వచ్చింది. యథేచ్ఛగా మరో స్త్రీని వివాహం చేసుకోక ఆ లంకేశ్వరుడితో ఇంత రక్తపాతమూ అవసరమా?"

రాముడు చేయి ఎత్తి అతడిని దగ్గరగా పిలుస్తూ "ప్రశ్న అడిగి, భయంతో అంత దూరంగా వెళ్లిపోతున్నావేమిటి? బాణానికి అందనంతగా వెళ్లాలనా నీ ఉద్దేశం? ఇలా దగ్గరగా రా. నువ్వు అడిగిన ప్రశ్న చాలా సమంజసమైనది. సమాధానం తెలుసుకోవాల్సినంత గొప్పది. నీ మీద కోపం తెచ్చుకోవలసిన అవసరం లేదు. నీ ఉద్దేశ్యం నువ్వు చెప్పావు. కానీ యదార్థం నేను చెబుతాను విను. రావణుడు క్రూరుడు. బలహీనులను చెరబట్టి తృప్తి చెందే పీడన కాముకుడు. అతడిని వధించటం ధర్మం. రెండో విషయం. 'వే' అంటే 'వినదగినది'. 'దం' అంటే 'ఆచరించ వలసినది'. సీత నా వేదం. సీత లేదని తెలిసిన రోజు రాముడు లేడు. ఆమె కేవలం నా భార్య కాదు. కూతురు. తల్లి. అన్నీ..! తన తల్లిని ఎవడో బంధిస్తే యోధుడు మరో తల్లి కోసం వెతకడు".

... ... ...

చెప్పటం ఆపాడు హనుమంతుడు. ఆనందంతో సీత వదనం విచ్చిన కమలంలా ఉన్నది. భర్తకు తనపై నున్న అంత గొప్ప అభిప్రాయం తెలిసిన ఏ భార్యకైనా సంతోషం కలగటం సహజమే కదా.

కపిల శ్రేష్టుడు ఆమెను ఆ విధంగా సంతస పరచి లేవబోతూ ఉంటే, "అంజనీ పుత్రా. ఒక నిమిషం ఆగు. నీవు సకల శాస్త్ర పారంగతుడివి. ఎప్పటినుంచో నాలో ఉన్న ఒక్క సందేహాన్ని తీర్చి వెళ్ళు. నా పతి జన్మసమయంలో బ్రహ్మదేవుడు ఎందుకు కంపించాడు?"

చెప్పాలా వద్దా అన్నట్టు వాయుపుత్రుడు క్షణం ఆగి, "అంత లోతైన విషయాలు నాకు తెలియవు తల్లీ. నీ పతిదేవుడు సామాన్య మానవుడు కాదనీ, కమల నాభుడయిన విష్ణు అంశ అనీ, బ్రహ్మ జలజాతాసనుడనీ తెలుసు."

ఆమె సాలోచనగా అతని వైపు చూస్తూ ఉండిపోయింది. ఆమెకు అర్థమైందని అతడికి అర్థమై నమస్కరించి అక్కడి నుంచి లేచాడు.

(తాను యుగపురుషుడనని రామునికి తెలియదు. రావణ సంహారం నిమిత్తం అతడిని అడవికి పంపాలి. అందుకే దేవతలు మంథర పాత్ర సృష్టించారని ఒక కథ. రావణుడి చేత బాధింపబడిన అనేక మందిలో ఒకరైన దుందుభి బ్రహ్మని ప్రార్థిస్తే, 'వచ్చే జన్మలో నీ మాటల కారణంగా రావణుడు రాముడి చేత మరణం పొందుతాడు' అని బ్రహ్మ దుందుభికి వరం ఇచ్చాడని మరొక కథ. వాల్మీకి రామాయణంలో మాత్రం, కార్యం పూర్తయిన తరువాత మంథర లేదు).

– 4–

అకస్మాత్తుగా మెలకువ వచ్చింది అవనిజకి. పక్కన పతి లేడు. మరి కొంచెం సేపు ఎదురు చూసింది. చపుడు లేదు. తన కొరకే కదిలే ఆ అడుగుల సడి తన కెరుకే. అవి కాదు గాని ఏవో మాటలు వినిపించాయి. అందులో ఒక స్వరం స్త్రీది. ఆమెకు ఆశ్చర్యం వేసింది. అంత అర్ధరాత్రి తన భర్త ఎవరితో మాట్లాడుతున్నాడు? అయినా తమ శయ్యాగృహాంతర్భాగం లోపలి వచ్చి అతడిని లేపే ధైర్యం ఎవరికి ఉంటుంది? అందులోనూ ప్రత్యేకంగా ఈ రోజు?

దిగి, శయన మందిరం దాటి విశాలమైన పడసాలలోకి వచ్చింది. తెరల చాటున రెండు ఆకారాలు కనబడుతున్నాయి. ఒకటి తన భర్తది. మరొకటి ఎవరో స్త్రీది. వెలుతురు ఎక్కువగా లేదు. తలపై ముసుగు కప్పుకొని ఉన్నది. ఆమె ఎవరు? ఆ విధమైన అనుమానంలో సీత కొట్టుమిట్టులాడుతూ ఉండగా భర్త స్వరం తిరిగి వినిపించింది.

"ఇందులో తప్పు ఏమున్నది?" అంటున్నాడు రాముడు. ఆమె గుండె గుభిల్లుమన్నది. మనసంతా అదోలా అయిపోయింది. ఇంత అర్ధరాత్రి తన భర్తతో తప్పొప్పులు చర్చించేటంత చనువు ఏ స్త్రీ కి ఉన్నది? మరింత పరిశీలనగా చూసింది. కౌసల్య, కైక, సుమిత్ర... అత్తలు ముగ్గురూ కాదు. రాజవాసాల్లో స్త్రీలందరూ తనకు తెలుసు. వారెవరూ కాదు. మరెవరు? తెరచాటున నిలబడి భర్త మాటలు వినసాగింది.

"అయోధ్య వాసులంతా ఇంత ఆనందంగా ఉన్న సమయంలో నా తల్లికి వ్యథ దేనికి? తను స్వయంగా రావటానికి మొహం చెల్లకపోవటమేమిటి? ఆమె బాధ చూసి క్షమించమని అడగటానికి అర్ధరాత్రి నీవు రావటమేమిటి? నీలాంటి సేవిక ఉండటం ఆమె అదృష్టం. అయినా ఆమె తప్పు ఏమున్నది? కొడుకుని రాజుగా చూడాలని ఆమె కోరిక."

అతడు ఆగి అన్నాడు. "...తప్పు కన్నా అపరాధ భావన మరింత బాధ పెడుతుంది. నా తమ్ముడు లక్ష్మణుడు నవ్వినప్పుడు 'అన్న చావు రహస్యం చెప్పి రాజునయ్యానని లక్ష్మణుడు నవ్వాడ'ని విభీషణుడు, 'తండ్రిని చంపించి చిన్నాన్నను రాజును చేసినందుకు' నవ్వుతున్నాడని అంగదుడు అనుకున్నది ఈ అపరాధ భావనతోనే. కాబట్టి మంధరా..! నా తల్లి కైకాదేవికి చెప్పు. తండ్రి మాట విని అడవికి వెళ్ళటం నాకు మనసా వాచా ఇష్టమే. అవతలివారికి నష్టం కలిగించనిదేదీ తప్పు కాదు. అయినా తప్పు చెయ్యని వారు ఎవరు? తన సహజ స్వభావంతో చేసిన పనికి అల్పజీవి కాకిపై నేను బ్రహ్మాస్త్రం వేయలేదా? అందరూ ఏమనుక్కుంటారో అని ఆలికి అగ్ని పరీక్ష పెట్టి తప్పు చేయలేదా? అంతవరకూ ఎందుకు? ఇన్నాళ్ళు నాతో కలిసి కాపురం చేసిన భార్య, అర్ధరాత్రి నేను పక్కన లేకపోవటంతో అనుమానంతో వచ్చి తెరచాటు నుంచి వింటే మాత్రం అందులో తప్పు ఏమున్నది? అది సహజమే కదా"

సీత గతుక్కుమంది. "ప్రేమ ఉన్న చోట అనుమానం ఉంటుంది. ఆ సందిగ్ధం పొర పగిలినప్పుడు అవతల మనిషి మీద నమ్మకం మరింత బలపడుతుంది".

సీత వడివడిన వెనక్కి వెళ్ళి పక్క పై వాలుతూ, 'అహం కస్యచిత్ హాని న కృతవాన్. ఏతత్ నామ్ పాపం నాస్తి' అనుకుంది.

(**తొలి ఇతిహాసం:** రామాయణం. **దొప్పలు:** రేకులు. **గుప్పిలి:** పిడికిలి. **ఇప్పతి:** ఈ పతి/భర్త. **శుక్ర శుక్ర శిష్యాగ్రణి**: రాక్షస స్త్రీలలో ఉత్తమురాలు. **గ్రీష్మ**" ఎండ. **హేమం**: చలి. **విశ్వంభర:** భూదేవి. **కాశ్యపి:** భూమాత. **అటజని:** అక్కడికి వెళ్లి. **ఆమని:** వసంతం. **అవనిజ:** భూమి నుంచి పుట్టినది సీత. **వని**: అడవి. **మలిసంజె:** సాయంకాలం. **వింజె:** వింధ్య పర్వతం. **నూబూవు నాసిక**: నువ్వు పువ్వు లాంటి ముక్కు (విజయ విలాసము). **నూవు దళ పత్ర:** లేలేత ఆకు. "అడుగు" అన్నాడు రాముడు చిరునవ్వుతో. **కందళి:** లేడి/జింక. **కన్నాకు చెంప:** తమలపాకుల కట్టపై అన్నిటికన్నా పైనున్న మొదటి లేలేత ఆకు లాంటి చెంప. **అన్నులమిన్న**: అందమైన స్త్రీ. **కన్నువిలుకాడు**: మన్మధుడు. **చాపాకృతి**: విల్లులా వంగిన. **వేణి:** జడ. **సుగంధ కుంతల**: పరిమళ భరితమైన కురులు కలది. **ఘన చంచరీక చికుర దీర్ఘ వినీల వేణి**: వత్తయిన జడ కలది ('ఈ ధనుస్సుని ఎత్తలేని వాడిని రేపు ఆ జడనేమి ఎత్తుతాను?' అనుకున్నాడని కవి కల్పన). **పారావారము:** సముద్రము. **వధూటి:** స్త్రీ. **ప్రావాదము**: రూమరు. **అని:** యుద్ధము. **అరి:** శత్రువు. **తిమిరం:** చీకటి. **నీలద్యుతి:** నీలి రంగు (వెలుగు కలవాడు). **ధనుష్టంకారం/మౌర్వీరవం:** వింటి నారి మీటిన శబ్దం. **శతాధిక పున్నముల తరువాత:** వంద దాటిన పున్నములు... దాదాపు పద్నాలుగు సంవత్సరాల తరువాత. **చిలుక తత్తడి రౌతు, గుబ్బి గుబ్బల రేడు**:మన్మధుడు.**అగ్రజుడు:** అన్న. **అనుజుడు:** తమ్ముడు.**కమలనాభుడు:** విష్ణువు. **జలజాతాసనుడు:** విష్ణువు బొడ్డు నుంచి పుట్టిన బ్రహ్మ. **పడసాల:** విశాలమైన చావిడి).

COMMENTS